ప్రజాశక్తి

శుక్రవారం 28 జూన్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

వీడని పైపులైన్ భయం

◆ పాయకరావుపేటను చుట్టుముట్టనున్న రసాయన పరిశ్రమలు ◆ ఆగని హేచరీస్ యజమానుల ఒత్తిళ్లు
◆ వెంకటనగరం తీరంలో కాకినాడ సెజ్ వ్యర్థాల విడుదలకు యత్నాలు ◆ హోం మంత్రి అనితపైనే మత్స్యకారుల ఆశలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

కాకినాడ సెజ్ వ్యర్థ రసాయన పైపులైన్ భయం పాయకరావుపేట తీరప్రాంత మత్స్యకారులను వెంటాడుతోంది. హేచరీస్ యాజమానుల కోసం కాకినాడ సెజ్‌కు సమీపంలోని సముద్రతీరాన్ని వదిలి దాదాపు 30 కిలోమీటర్ల దూరంలోని పాయకరావుపేట నియోజకవర్గం వెంకటనగరం సముద్రతీరంలో వ్యర్థాలు విడిచిపెట్టే పైపులైన్ ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ సారి కూటమి ప్రభుత్వం రావడం, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో పాయకరావుపేట మండలం వెంకటనగరం సముద్ర తీరంలో పైపులైన్ ఏర్పాటు జరగదని మత్స్యకారులు భావిస్తున్నా.. వారిలో ఇంకా మునుపటి భయం పోలేదు. కాకినాడ జిల్లా తొండంగి మండలం పెరుమళ్లపురం ప్రాంత పరిశ్రమల రసాయనాలు వెంకటనగరం సముద్రతీరంలో వదిలేందుకు గత ప్రభుత్వ కాలంలో జరిగిన పైపులైన్ నిర్మాణ పనులను మత్స్యకారులు కొద్ది కాలం క్రితం అడ్డుకున్నారు. పోలీసు బలగాల మధ్య పనులు పూర్తిచేయాలని చేసిన ప్రయత్నాలు మిగతా 2లో..



వెంకట నగరం సముద్ర తీరంలో పైపులైన్ పనుల కోసం వేసిన మట్టిరోడ్డు

వార్త 2లో..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

విశాఖ జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణానికి

నెలరోజుల్లోగా శంకుస్థాపన చేయాలి

10న కోర్కెల దినాన్ని విజయవంతం చేయండి

◆ మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పండి
◆ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపు


ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : మూడోసారి అధికారంలోకి వచ్చిన కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేయడానికి పూనుకుంటోందని, ఆ విధానాలకు అడ్డుకట్ట వేసేందుకు జులై 10న దేశవ్యాప్తంగా తలపెట్టిన కోర్కెల దినాన్ని విజయవంతం చేయాలని మిగతా 2లో..



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు







మొదటి పేజీ తరువాయి..

వీడని పైపులైన్ భయం

ఫలించకపోవడంతో పైపులైన్ నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. తరువాత ఎన్నికలు సమీపించడంతో పైపులైన్ పనుల జోలికి ప్రభుత్వం వెళ్లలేదు.

అయితే హేచరీస్ యాజమాన్యాల ఒత్తిళ్లకు తలొగ్గి వెంకటనగరంలో పైపులైన్ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకపోవడంతో పైపులైన్ ప్రమాదం మత్స్యకారులకు పోలేదు. గత సర్కారు కాకినాడ్ సెజ్‌కు రెండు కిలోమీటర్ల దూరంలోని సముద్రతీరాన్ని వదిలిపెట్టి 30 కిలోమీటర్ల దూరంలోని వెంకటనగరం తీరంలో రసాయనాలు విడిచిపెట్టి మత్స్యకారుల బతుకులను దెబ్బతీయాలని చూసింది. పైపులైన్ ఏర్పాటుపై గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేస్తుందని మత్స్యకారులు భావిస్తున్నారు. ఇప్పటికే డెక్కన్ కంపెనీ రసాయనాలను సముద్రంలో వదలడంతో మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింది. సముద్ర తీరానికి సమీపంలో దొరికే చేపలు కిలోమీటర్లు దూరం వేటకు వెళ్లినా ఇప్పుడు లభించడంలేదు. ఈ నేపథ్యంలో వెంకటనగరం తీరంలో పైపులైన్ ఏర్పాటు జరిగితే పాయకరావుపేట మండలం వెంకటనగరం పంచాయతీలోని వెంకటనగరం, రాజానగరంతో పాటు పరిసర తీరప్రాంత మత్స్యకారుల జీవనోపాధికి నష్టం ఏర్పడుతుందని వారు భయపడుతున్నారు. కాకినాడ సెజ్ సమీపంలోని సముద్రంలో వ్యర్థాలు వదిలితే ఆ ప్రాంత హేచరీస్ దెబ్బతింటాయని వాటి యజమానులంతా ఒక్కటయ్యారు. ఆ ప్రాంతంలో పైపులైన్ ఏర్పడకుండా ఇప్పటికీ ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే 2023 సెప్టెంబరు 20న బల్క్ డ్రగ్ పార్కును కాకినాడ సెజ్ నుంచి నక్కపల్లికి తరలించాలని గత రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసే బల్క్ డ్రగ్ పార్కు, పైపులైన్ ఏర్పాటును కూటమి ప్రభుత్వం వెనక్కు తీసుకుంటుందా ? ఆ నిర్ణయం రద్దయ్యే వరకు హోం మంత్రి అనిత పట్టుబడతారా ? లేదా ? అనేది వేచిచూడాలి.

10న కోర్కెల దినాన్ని విజయవంతం చేయండి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమలు చేసే ఉత్తర్వులను ఇవ్వడానికి సిద్ధపడుతోందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత కార్మిక, ప్రజా వ్యతిరేక చట్టాలను అమలు చేయడానికి తగిన కార్యాచరణ రూపుదిద్దుకుంటోందని తెలిపారు. పిఎఫ్‌కు సంబంధించి యాజమాన్యం వాటా చెల్లించకపోతే ఫెనాల్టీతో చెల్లించాలన్న నిబంధన తొలగించారని తెలిపారు. ఇప్పుడు యాజమాన్యం కార్మికుల ఖాతాలో జమచేయవలసిన వాటాను ఎప్పుడైనా కట్టవచ్చునని అన్నారు. ఇప్పటి వరకూ ఫెనాల్టీ నిబంధనలు ఉన్నా చాలా కంపెనీలు ఇన్‌టైంలో పిఎఫ్ ఖాతాలో డబ్బులు జమచేయటం లేదని అన్నారు. అలాగే పూర్తి విచారణ జరిపి నాన్‌బెయిల్ వారెంట్ ఇవ్వడానికి వున్న అవకాశాన్ని కూడా తొలగించారన్నారు. దీని వల్ల పెన్షన్ భవిష్యత్తులో వస్తుందన్న గ్యారెంటీ లేకుండా పోతుందన్నారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చడం వల్ల కార్మిక వర్గం తీవ్ర శ్రమదోపిడీకి గురవుతుందని తెలిపారు. తక్షణమే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ప్రైవేటీకరణను, నేషనల్ మోనిటైజేషన్ ఆఫ్ పైపులైన్‌లను ఆపాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు చొప్పున నిర్ణయించి అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టరును తొలగించినా కార్మికులను తొలగించరాదని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలని కోరారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని, వారికి కనీస వేతనాలు చెల్లించాలని, ఇతర సౌకర్యాలు అమలు జరపాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని, ప్లాంట్ రక్షణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. బిల్డింగు, ఆటో, ముఠా, తోపుడు బండ్ల కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని కోరారు. పై డిమాండ్లతో వచ్చే నెల 10న దేశవ్యాప్తంగా కోర్కెల దినం జరపాలని నిర్ణయించామని, కార్మిక వర్గం విజయవంతం చేసి, మోడీ ప్రభుత్వానికి హెచ్చరిక పంపాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి పాల్గొన్నారు.

ముగిసిన సిఎంఆర్ క్రికెట్ లీగ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిఎంఆర్ టెక్స్‌టైల్స్ అండ్ జ్యూయలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం తమ ఉద్యోగులలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు తలపెట్టిన క్రికెట్ లీగ్ ఉత్సాహపూరిత వాతావరణంలో ముగిసింది. సిఎంఆర్ షాపింగ్ మాల్, సిఎంఆర్.జ్యూయలరీ, సిఎంఆర్ సెంట్రల్, సిఎంఆర్ ఫ్యాషన్స్, కంచి కామాక్షి, మావూరి షాపింగ్ మాల్స్ నుంచి 100 టీములు, సుమారు 1400 మందికి పైగా ఎంప్లాయిస్ ఈ లీగ్‌లో పాల్గొన్నారు. లీగ్‌ను తిరుపతి, విజయవాడ ఖమ్మం, హైదరాబాద్, ఒంగోలు, రాజమహేంద్రవరం, విశాఖపట్నం ప్రాంతాల్లో నిర్వహించారు. సిఎంఆర్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ విన్నర్స్ టీమ్ గోపాలపట్నంకు షీల్డుతోపాటు రూ.1,15,000 నగదు బహుమతి అందజేశారు. రన్నర్ టీమ్ ఉప్పల్‌కు షీల్డుతోపాటు రూ.75000 అందించారు.

కెజిహెచ్ అభివృద్ధికి మరింత కృషి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్రకే తలమానికమైన కింగ్ జార్జ్ ఆసుపత్రి (కెజిహెచ్)లో మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి తన వంతు కృషిచేస్తానని దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. గురువారం కెజిహెచ్‌లోని నవజాత శిశు తీవ్ర వ్యాధుల చికిత్స కేంద్రం ఎదురుగా రూ.15 లక్షల ఆసుపత్రి అభివృద్ధి నిధులతో చేపట్టిన రోగుల సహాయకుల వేచి ఉండు గదిని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఆంధ్రా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు పాల్గొన్నారు.

విశాఖ జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణానికి

నెలరోజుల్లోగా శంకుస్థాపన చేయాలి

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణానికి టిడిపి కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని, నెల రోజుల్లోగా శంకుస్థాపన చేయాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ, పౌర గ్రంథాలయ సేవా సమితి యాక్షన్ టీం నాయకులు ఎంవిఎస్.శర్మ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో పౌరగ్రంథాలయాల సేవా సమితి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్ర గ్రంథాలయం భవనం పునర్నిర్మాణం కోసం భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక, పోరాటాన్ని పౌర గ్రంథాలయాల సేవా సమితి ద్వారా ప్రభుత్వం ముందుకు తీసుకు వెళ్తున్నామని తెలిపారు. గ్రంథాలయ భవనం నిర్మాణానికి అవసరమైన ఎకరా స్థలం, నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. జివిఎంసి వద్ద రూ.200 కోట్లు ఉన్నాయని, అందులో రూ.2 కోట్లు గ్రంథాలయ భవనం నిర్మాణానికి ఖర్చు చేయడం పెద్ద సమస్య కాదని తెలిపారు. పౌర గ్రంథాలయాల సేవా సమితి అధ్యక్షులు బిఎల్.నారాయణ మాట్లాడుతూ విశాఖ దక్షిణ నియోజకవర్గం పరిధి మహారాణిపేట దండుబజారులోని జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన సుమారు ఎకరం స్థలంలో ఏళ్ల కాలంగా జిల్లా కేంద్ర గ్రంథాలయం నడుస్తుండేదని, 2010లో ఆ స్థలాన్ని మాజీ మంత్రి, ప్రస్తుత భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు చెందిన ప్రత్యూష ప్రైవేటు సంస్థకు 33 సంవత్సరాలకు లీజుకు ఇచ్చారని, ఆ సంస్థ గ్రంథాలయ భవనాన్ని నేల మట్టం చేసిందని తెలిపారు. అనంతరం పౌరగ్రంథాలయాల సేవా సంస్థ చేసిన పోరాటం ఫలితంగా 2014లో ఆ లీజు ఒప్పందం రద్దు అయిందన్నారు. ఇప్పటికి 13 సంవత్సరాలు గడిచిపోయినా కాంగ్రెస్, తెలుగుదేశం, వైసిపి ప్రభుత్వాలు జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన పునర్నిర్మాణం చేపట్టలేదన్నారు. జిల్లాలోని విద్యార్థులు, నిరుద్యోగులు, ఇతర ప్రజానీకం నగరంలో సరైన గ్రంథాలయం లేక అనేక ఇక్కట్ల పాలవుతున్నారని తెలిపారు. ప్రస్తుతం జివిఎంసికి ప్రజలు ఆస్తి పన్నుల రూపంలో రూపాయికి 8 పైసలు చొప్పున గ్రంథాలయం పన్ను కూడా చెల్లిస్తున్నారని, రూ.200 కోట్లకు పైబడి జివిఎంసి దగ్గర ఆ నిధులు ఉన్నాయని, వాటిలో కొన్ని కోట్ల రూపాయలు జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థకు సమకూరుతుందని, అందులో 2 కోట్ల రూపాయలు వెచ్చించి జిల్లా కేంద్ర గ్రంథాలయానికి భవనం నిర్మించవచ్చునని తెలిపారు. దీనిపై అనేకసార్లు ప్రభుత్వానికి నివేదించినా ఫలితం లేకపోయిందన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం పాలనలో మార్పులకు శ్రీకారం చుట్టామని ప్రకటించిందని, దీనికి గీటురాయిగా విశాఖ కేంద్ర గ్రంథాలయ భవనాన్ని వెంటనే నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఈ అంశాన్ని పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో తాము రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర మంత్రుల దృష్టికి ఆ సమస్యను తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో పౌర గ్రంథాలయ సేవా సమితి కార్యదర్శి కె.త్రిమూర్తులు, కోశాధికారి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఎయు విసి రాజీనామా చేయాల్సిందే..

ఆయన ఛాంబర్ వద్ద విద్యార్థి, యువజన సంఘాల బైఠాయింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎయు విసి పివిజిడి.ప్రసాద్‌రెడ్డి తక్షణం రాజీనామా చేయాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల చిత్రపటాలను తన ఛాంబర్‌లో పెట్టాలని డిమాండ్ చేస్తూ ఎయు పరిరక్షణ సమితి, టిఎన్‌ఎస్‌ఎఫ్, జనసేన విద్యార్థి విభాగం, దళిత విద్యార్థి విభాగం, పలు యువజన సంఘాల ఆధ్వర్యాన గురువారం మధ్యాహ్నం ఎయు విసి ఛాంబర్ ఎదుట బైఠాయించారు. వైసిపి నాయకునిగా వ్యవహరించిన విసి ప్రసాద రెడ్డి ప్రభుత్వం ఆదేశించినా ఇంతవరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల చిత్రపటాలను తన ఛాంబర్‌లో పెట్టలేదన్నారు. ఆయన అక్రమాల మీద విచారణ కమిటీ వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని వారికి సర్దిచెప్పారు కార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రణవ్ గోపాల్, జనసేన విద్యార్థి, యువజన సంఘాల నాయకుడు మర్రివేముల శ్రీనివాస్, డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విసి ఛాంబర్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

---

3 వరకు కియా ఫ్రీ సర్వీస్ క్యాంప్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేశంలోనే ది బెస్ట్ బ్రాండ్‌గా కియా మోటార్స్ నిలిచిందని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ అన్నారు. కియా ఫ్రీ సర్వీస్ క్యాంపును ఆయన సోమవారం ఉదయం మధురవాడలోని లక్ష్మి కియా షోరూంలో ప్రారంభించారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తగదు

సిఐటియు, హెచ్‌ఎంఎస్ నాయకులు డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయాలనుకోవడం దుర్మార్గమని సిఐటియు కంచరపాలెం జోన్ ప్రధాన కార్యదర్శి ఒ.అప్పారావు, హెచ్‌ఎంఎస్ అధ్యక్షులు దొమ్మేటి అప్పారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన చేపట్టిన రిలేదీక్షలు గురువారమూ కొనసాగాయి. దీక్షల్లో హెచ్‌ఎంఎస్, సిఐటియు కంచరపాలెం జోన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు ప్రభుత్వం సొంత గనులు కేటాయించాలన్నారు. ప్రత్యేకంగా ఆర్థిక ప్యాకేజీ ఇవ్వాలన్నారు. దీక్షల్లో కంచరపాలెం జోన్ సిఐటియు నాయకులు ఎం.ఈశ్వరరావు, ఎస్.శ్రావణ్, బి.గంగరాజు, హెచ్‌ఎంఎస్ నాయకులు గొందేసి రమణారెడ్డి, జి.సత్యారావు, గొడ్డి రమణ, వెంకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుపై బిజెపి డ్రామా : కెఎ.పాల్

ఢిల్లీలో స్టీల్‌ప్లాంట్ విషయంలో బుధవారం బిజెపి ఎంపీలు ఆడిన డ్రామాను ప్రజలు గమనించారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కెఎ.పాల్ అన్నారు.

రైల్వే న్యూ కాలనీలోగల పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి అంటూ కేంద్ర ఉక్కు శాఖ మంత్రికి బిజెపి ఎంపిలు వినతి పత్రం అందజేయడం హాస్యాస్పదమన్నారు. కేంద్రంలోని బిజెపి స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేస్తుండగా, ఆ పార్టీ ఎంపీలు ప్రధానికి బదులుగా ఉక్కు శాఖ మంత్రిని కలవడం ఏమిటని ప్రశ్నించారు.

IN THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION-II AT VISAKHAPATNAM
C.C. 300/2023

Between:
Sri P. Varada Rajulu ...Complainant
And
The Professional Courier, Rep. by its Manager ...Opposite Party

NOTICE

To, **The Opposite Party:**
The Professional Courier,
Rep. by its Manager, D.No.47-9-15/2,
3rd Lane, Dwarakanagar,
Visakhapatnam,
Andhra Pradesh-530016.

Take notice that the above named complainant filed the above C.C.300/2023 against you under Section 35 of C.P. Act., and the matter stands posted to **03-07-2024** for your appearance. The above mentioned Opposite Party is therefore hereby directed to appear before the Hon'ble District Consumer Disputes Redressal Commission-II, VUDA Complex, Siripuram, Visakhapatnam at **10.30 A.M** on **03-07-2024** either yourself in person or by authorized person, failing which the Hon'ble Commission will proceed with the matter against you as per law.

(By Order of the Hon'ble Commission)
GEDDAM AJAY KUMAR,
Advocate, Visakhapatnam.
Cell: 94917 90899.

CHANGE OF NAME

I, **SRIRANGAM KONDA RAO** (New Name) S/o. **APPALARAJU**, previously called **SREE RANGAM KONDARAO** (Old Name) resident of 3-75, Nagaram (V), Mallavaram (PO), Makavarapalem(M), Anakapalli Dist.,- 531113, Andhra Pradesh. Now changed my name from **SREE RANGAM KONDARAO** (Old Name) to **SRIRANGAM KONDA RAO** (New Name) Henceforth I will be called as **SRIRANGAM KONDA RAO** (New Name) for all purposes.

ఐకమత్యంగా అభివృద్ధి చేద్దాం

మండల సర్వసభ్య సమావేశంలో నాయకులు

ప్రజాశక్తి -ఆనందపురం : ఐకమత్యంగా పనిచేసి ఆనందపురం మండలాన్ని అభివృద్ధి చేద్దామని పలువురు నాయకులు మండల సమావేశంలో పిలుపునిచ్చారు. ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ అప్పలనాయుడు ఆధ్వర్యాన ఎంపిపి డాక్టర్ మజ్జి శారదప్రియాంక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఏర్పాటుచేసిన మొదటి సమావేశంలో జడ్‌పిటిసి సభ్యులు కోరాడ వెంకటరావు మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పనకు ప్రాధాన్యత లేక కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సర్పంచులు ఎంపిటిసి సభ్యులు వారి పరిధిలో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా గ్రామాల్లో రోడ్లు శిథిలావస్థలో ఉన్నాయని, పనులు చేపట్టాలని కోరారు. బిపి కల్లాలులో రోడ్డు అసంపూర్ణంగా ఏర్పాటుచేశారని, ఆనందపురం పంచాయతీ దొంతలవారి కల్లాలలో నాలుగేళ్ల క్రితం రోడ్డు ఏర్పాటుకు మెటల్ వేసి వదిలేసారని, ఆనందపురం బాలికల వసతి గృహం రోడ్డు పనులు మధ్యలోనే ఆగిపోయాయని, ఆ పనులు పూర్తిచేయాలని సర్పంచులు కోన పైడిరాజు, చందక లక్ష్మి కోరారు. బిపి కల్లాలులో పాఠశాల భవనం ఏర్పాటు చేయాలని కోన శ్రీను కోరారు.

ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి సంధ్యా రత్నప్రభ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంట రుణాలు సున్నా వడ్డీతో రైతులకు అందిస్తామని తెలిపారు. వర్షాకాలంతో డెంగీ, మలేరియా, విష జ్వరాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని పిహెచ్‌సి డాక్టర్ గంగునాయుడు సూచించారు. జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ఆనందపురం మండలంలో పిహెచ్‌సి స్థానంలో సిహెచ్ సి ఏర్పాటు చేయాలని తర్లువాడ సర్పంచ్ బిఆర్‌బి నాయుడు కోరారు.

వెల్లంకి చెరువు పూడికలు తీయక నీరు నిల్వలేక పూర్తిగా ఎండిపోయాయని, వెంటనే అనుసంధానంగా ఉన్న గెడ్డలను శుభ్రం చేసి వర్షాధార నీరు చెరువులోకి వచ్చేటట్లుగా ఏర్పాటుచేయాలని ఆ గ్రామ ఉపసర్పంచ్ కంచరాపు శ్రీను అధికారులను కోరారు. రెవెన్యూకు సంబంధించి 33 గ్రామాల్లో రీ సర్వే కంప్లీట్ చేశామని, ఇంకా 21 గ్రామాల్లో సర్వే చేయాలని ప్రభుత్వ అనుమతి కోసం ఎదురు చూస్తున్నామని డిప్యూటీ తహశీల్దార్ రాజేష్ తెలిపారు. శిర్లపాలెంలో పంచాయతీ భవనం లేక ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్ సిర్ల అప్పలనాయుడు సభ దృష్టికి తీసుకెళ్లారు. మండలంలో 2520 గృహాలలో ఇప్పటివరకు 1095 పూర్తయ్యాయని, స్లాబ్ లెవల్‌లో 116 ఉన్నాయని, కొన్ని వివిధ దశల్లోనూ, 744 ఇళ్లు ఇంకా ప్రారంభం కాలేదని హౌసింగ్ అధికారులు వివరించారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇప్పటివరకు 154 గ్రాంట్లు రూ.29.47 కోట్ల పెట్టుబడితో పనులు చేపట్టామని, 35 పనులు పూర్తయ్యాయని, కొన్ని వివిధ దశలో ఉన్నాయని, 50 పనులు ప్రారంభం కాలేదని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఎస్-ఎస్ఆర్.మూర్తి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పాండ్రంకి శ్రీను, ధనలక్ష్మి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, సర్పంచులు బలిరెడ్డి మల్లికార్జునరావు, గంగరాజు, చందక లక్ష్మి, మహంతి వెంకటలక్ష్మి, శివాజీ, కొన శ్రీను పైడిరాజు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధి ఉప్పాడ జంక్షన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఎస్ఐ పైడిరాజు కథనం ప్రకారం... వార్డులోని కె.గొల్లలపాలెం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ చందక వెంకటరమణ (42), తన మోటారు సైకిల్ పై భీమిలి వస్తుండగా, ఎదురుగా రాంగ్ రూట్‌లో హీరో ప్యాషన్ బైక్‌పై అతి వేగంగా వస్తూ ఓ వ్యక్తి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకట రమణ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని 108 వాహనంలో కెజిహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో అదే రోజు అర్ధరాత్రి దాటాక మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భీమిలిలో ట్యూషన్ చదువుతున్న ఇద్దరు పిల్లలను మోటారు సైకిల్‌పై తీసుకొచ్చేందుకు వెంకటరమణ ఇంటి నుంచి వెళ్తూ ఈ ప్రమాదానికి గురయ్యాడు.

ఖాతాదారుల నమ్మకంతో అభివృద్ధి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఖాతాదారులకు నమ్మకంతో సేవలు అందించడంతో సొసైటీ ఎంతో అభివృద్ధి సాధించిందని ది సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పిఆర్‌విపిఎస్.రాజు పేర్కొన్నారు. పౌరగ్రంథాలయంలో గురువారం నిర్వహించిన ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఐదు రాష్ట్రాలలో 42 బ్రాంచీలతో రూ.4000 కోట్ల లావాదేవీలతో సేవలను అందిస్తున్నామన్నారు. సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ కెవి.సుబ్బయ్య మాట్లాడుతూ, దేశంలోని టాప్ 10 సొసైటీలలో మన సొసైటీ ముందుందని తెలిపారు. ఈ ఏడాది రూ.77 కోట్ల లాభాన్ని అర్జించిందని, షేర్ హోల్డర్స్‌కు గత ఏడాది 18 శాతం డివిడెండ్ చెల్లించడమే కాకుండా సేవింగ్ ఖాతాపై 6.5 శాతం వడ్డీ, డిపాజిట్లపై 10 శాతం అత్యధిక వడ్డీ చెల్లిస్తున్నామని వివరించారు. 2024 డిసెంబర్ నాటికి రూ.5 వేల కోట్లు లావాదేవీలు పూర్తి చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ ఎస్ఎస్.నాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

రచయితకు సాంఘిక బాధ్యత

ప్రజాశక్తి-సీతమ్మధార : రచయితకు సాంఘిక బాధ్యత ఉండాలని రచయిత డాక్టర్ ఎం.సుగుణరావు అన్నారు. సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యాన రాజేంద్రనగర్‌లోని ప్రిజం కళాశాలలో వైవిధ్యభరితమైన కథలను రచయితలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కథలు ఆకాశంలో నుంచి ఊడిపడవని, జీవిత అనుభవాలే కథలకు ముడి సరుకు అని తెలిపారు. కదా వస్తువు కోసం జీవితాన్ని, శైలి కోసం సాహిత్యాన్ని చదవాలని సూచించారు. పీడిత, తాడిత, దళిత, బహుజన, మహిళావాద దృష్టి కోణం నేపథ్యంలో వచ్చిన వందలాది కథలను అధ్యయనం చేసిన తర్వాతే రచయితలు కలం పట్టాలన్నారు. రాజకీయ, సామాజిక అంశాలు, సమస్యలను ఆకళింపు చేసుకుని నిబద్ధతగా రాస్తే ప్రతి రచయిత మంచి సృజనకారుడు అవుతాడన్నారు. సహృదయ సాహితీ అధ్యక్షుడు శేఖర్ మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ, జీవితం నుంచే కథానికలు వస్తాయన్నారు. సిహెచ్ చినసూర్యనారాయణ, ఎస్.విజయ్‌కుమార్, కుప్పిలి భీమేశ్వరరావు, రామదాత, కెవిఎస్.మూర్తి, పివిఆర్ కుమారరావు, పరమేశ్వరరావు, రాధారాణి, సురేష్ కథా పఠనం చేశారు.

కూరగాయల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉద్యానవన శాఖ ఆధ్వర్యాన సీతమ్మధార రైతుబజార్‌లో కూరగాయల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, పందిరి కూరగాయల సాగు, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగుచేయడం, మల్చింగ్ పద్ధతిలో సాగు తదితర విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. సాగుపై రాయితీల కోసం వివరించారు. పందిరి మీద కూరగాయలు పెంచడం వల్ల లాభాలు వస్తాయన్నారు. కూరగాయల విత్తనాలు కొనేటప్పుడు క్యాష్ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం 50 శాతం రాయితీకి ఇస్తుందన్నారు. ఆధార్ కార్డు, 1బి కాపీ, పాస్‌పోర్టు ఫొటో, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ రైతు భరోసా కేంద్రంలో ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ మార్కెటింగ్ శాఖ అధికారి ఎస్‌కె.హుస్సేన్, జి.సోనీ, ఇఒ కొండబాబు, సహాయకుడు కె.సతీష్, రైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో తీవ్ర నష్టం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్లాస్టిక్ వ్యర్థాలు, తెగిన వలలు వల్ల సముద్రంలో ఉన్న జీవ రాశులకు ప్రాణ నష్టం వాటిల్లనుందని భారతీయ మత్స్య పరిశోధనా సంస్థ, మత్స్య శాఖ అధికారులు వివరించారు. 'సముద్ర జలాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, నిరుపయోగ వలల వల్ల సముద్ర జీవ రాశులకు కలుగు ప్రమాదాలు' అంశంపై ఉప్పాడ ఎఫ్‌డిఒ కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలో గండిగుండం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, యూనిఫామ్‌ను గురువారం టిడిపి జనసేన నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు గండ్రెడ్డి రమేష్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గవర సోంబాబు, అప్పలనాయుడు, సతీష్, శ్రీను, సోంబాబు, అప్పారావు, సన్నిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

డయాలసిస్ రోగికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ కాలనీ రాజీవ్‌నగర్‌కు చెందిన షేక్ వాలీబీ కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. వారానికి రెండు సార్లు డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుండటంతో కాలనీ వాసులు కొంత మొత్తాన్ని విరాళాలుగా సేకరించారు. రూ.26,200ను రాజీవ్ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ సెక్రటరీ గోపల్లి రామకృష్ణ ద్వారా గురువారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మూడెడ్ల రామ, లక్ష్మి, గోపిశెట్టి వెంకటలక్ష్మి, పాల్గొన్నారు.

ఎనిమియా ముక్త భారత్ అమలుపై సమీక్ష

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ జిల్లాలో ఎనిమియా ముక్త భారత్ అమలుపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో కేంద్ర బృందం సభ్యులు జితేంద్ర, ఎస్.పూజ, డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి కలిసి సంబంధిత ప్రోగ్రాం అధికారులతో సమావేశం నిర్వహించి చర్చించారు. అనంతరం హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలను, హైస్కూళ్లు, ప్రైమరీ స్కూళ్లను, అంగన్వాడీలను పరిశీలించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎస్.సమత వారితో కలిసి మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను, ప్రైమరీ, హైస్కూళ్లలో కార్యక్రమ అమలు తీరుపై వైద్యాధికారులనడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు అందించే ఐరన్ సిరప్స్, ఐరన్ మాత్రలు గురించి ఆరాతీశారు. గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కార్యక్రమం, వారు వాడే ఐరన్ టాబ్లెట్ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.జీవనరాణి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి, బి.నాగేశ్వరరావు, డాక్టర్ బి.ఉమావతి, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ హీన దీక్షిత్, ఐ.మనోరమ, శాంతిప్రియ, నాగభూషణం పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -భీమునిపట్నం : వ్యవసాయ రంగం అభివృద్ధికి తమ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తుందని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎండిఒ కార్యాలయంలో ప్రభుత్వ రాయితీపై ఖరీఫ్ పంటకు పచ్చి రొట్ట, వేరు శనగ విత్తనాలను గురువారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తన చేతుల మీదుగా రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ ప్రభుత్వంలో ఎపి అంటేనే అమరావతి, పోలవరం అని నిర్వచించారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించడం వల్ల పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా మండలాల వారీగా రైతులకు అందించనున్న వరి, పచ్చిరొట్ట, వేరు శనగ విత్తనాల వివరాలను నివేదిక రూపంలో వ్యవసాయ శాఖ భీమిలి డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ బొడ్డేపల్లి విజయప్రసాద్ వివరించారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో 2,200 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ విత్తనాలపై ప్రభుత్వం రూ.11.41 లక్షలు రాయితీని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి, ఆర్‌డిఒ ఎస్.భాస్కరరెడ్డి, ఎపి సీడ్స్ డిఎం సాయి, డిఎల్‌డిఎ చైర్మన్ గాడు వెంకటప్పుడు, వ్యవసాయ శాఖ అధికారులు బి.శివకోమలి, సంధ్య రత్నప్రభ, వెంకట సింహాచలం, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

షిప్‌యార్డుతో గీతం అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి-మధురవాడ : సాంకేతిక, మేనేజ్‌మెంట్ విభాగాలలో పరస్పర సహకారానికి వీలుగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. గీతం ప్రో-వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు సమక్షంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, హిందుస్థాన్ షిప్‌యార్డ్ బిజినెస్ డెవలప్‌మెంట్, ఐటి విభాగాల జనరల్ మేనేజర్ కమాండర్ జె.పి.గుప్తా గురువారం అవగాహన ఒప్పందాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా గీతం ప్రో-వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ, పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా మానవ వనరులను తీర్చిదిద్దడంతో పాటు పరిశోధనలకు గీతం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నిపుణులైన విద్యావేత్తలను, శాస్త్రవేత్తలను గీతంలో పనిచేసేలా ఆహ్వానించడంతో పాటు దాదాపు 100 కోట్లతో పరిశోధన కేంద్రాలను అభివృద్ధి చేశామని వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ సంస్థలు, పరిశ్రమలతో కలిసి పనిచేస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక పరిశ్రమలలో పనిచేసే అధికారులకు మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గీతం అధ్యాపకులు పరిశ్రమలకు కన్సల్టెన్సీ సేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు.

హిందుస్థాన్ షిప్‌యార్డు జనరల్ మేనేజర్ కమాండర్ జెపి.గుప్తా మాట్లాడుతూ, దేశంలోనే అతిపెద్ద నౌకానిర్మాణ కేంద్రంగా హెచ్ఎస్ఎల్ గుర్తింపు పొందిందన్నారు. వాణిజ్య, రక్షణ అవసరాలకు తగిన 200 నౌకలను తాము ఇప్పటివరకు నిర్మించామని, 2 వేలకు పైగా నౌకలకు మరమత్తులు నిర్వహించామని తెలిపారు. గీతంతో అవగాహన ఒప్పందం ద్వారా తమ సంస్థలోని వివిధ స్థాయి అధికారులకు గీతంలో శిక్షణ పొందే వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో గీతం ఆర్ అండ్ డి విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ, గీతంస్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా పి.పప్పు, గీతం పారిశ్రామిక సంబంధాల డిప్యూటీ డైరెక్టర్ సోంభట్ శాస్త్రి, హిందుస్థాన్ షిప్‌యార్డు అధికారులు రాజేంద్రకుమార్ రాజ్‌గోపాల్, రాజేష్‌పాండే, ఎస్.సోమసుందరం, గీతం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మీశ్వరి, పలువురు సీనియర్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

9వ వార్డులో పార్కు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 9వ వార్డు పరిధి సాగరతీరం జోడుగుళ్లపాలెం వద్ద మల్టీపార్కు నిర్మాణానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జివిఎంసి నిధులు రూ.1.8 కోట్లతో 1.8 ఎకరాల స్థలంలో యోగా, చిల్డ్రన్ ఎక్విప్‌మెంట్, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌లను ఈ పార్కులో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి డిఇ వంశీ, ఎఇ శ్రీధర్, వార్డు టిడిపి ఇన్‌ఛార్జి బుడుమూరు గోవిందు, అధ్యక్షులు అక్కురమాని రాంబాబు, ఉపాధ్యక్షులు మారుపల్లి చిన్నారావు, బిజెపి నాయకులు ఉమ్మడి సుజాత, టిడిపి నాయకులు బాదరు బాలరాజు, ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, ఒమ్మి పోలారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకమహాలక్ష్మి అమ్మవారి పండగ



పల్లా శ్రీనివాసరావుకు అమ్మవారి పటాన్ని బహూకరిస్తున్న కీర్తి

ప్రజాశక్తి -మాధవధార : సీతన్నగార్డెన్స్‌లో ఉన్న కనక దుర్గాలమ్మ, గాయత్రీదేవి, కనక మహాలక్ష్మి అమ్మవార్ల పండగ గురువారం ఆలయ ధర్మకర్త, 51వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సనపల కీర్తి ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులు అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త సనపల కీర్తి దంపతులు మొదటి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉచిత ప్రసాదం అందించారు. ఈ సందర్భంగా ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే గంటాశ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, 50వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సనపల వరప్రసాద్, వైసిపి నాయకులు పేడాడ రమణికుమారి, 51వ వార్డు కార్పొరేటర్ ఆర్ వెంకటరమణ, 51వ వార్డు బిజెపి అధ్యక్షులు తమ్మినేని లోహితరావు తదితరులు పాల్గొన్నారు

వేపగుంట - పినగాడి రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి-పెందుర్తి : వేపగుంట నుంచి పినగాడి వరకు రోడ్డును ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు గురువారం పరిశీలించారు. రోడ్డు అధ్వానంగా ఉండడంపై అధికారులతో మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రోడ్డు పనులను మూడు రోజుల్లో ప్రారంభించేలా చూస్తానని చెప్పారు. ఈ రోడ్డు పనులు పూర్తయితే ప్రమాదాల నివారణతో పాటు ట్రాఫిక్ సమస్యను నియంత్రించవచ్చని తెలిపారు. ఇకపై కూటమి ప్రభుత్వం అభివృద్ధికి కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సేనాపతి శేఖర్, పిల్లా జగన్మోహన్ పాత్రుడు, అయిత సింహాచలం, అప్పలరాజు, సరిపల్లి రమేష్, టిడిపి నాయకులు దాట్ల మధు గల్లా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరిపురంలో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి- ములగాడ : పారిశ్రామిక ప్రాంతంలోని శ్రీహరిపురంలో గురువారం ఎమ్మెల్యే గణబాబు, జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ పర్యటించారు. వర్షాకాలంలో వర్షం వరదనీరుతో తరచుగా శ్రీహరిపురం గెడ్డ పొంగుతుండటంతో ముందస్తు చర్యల్లో భాగంగా 60వ వార్డు కొండపై నుంచి శ్రీహరిపురం మెయిన్ రోడ్డు, గుల్లలపాలెం, 58వ వార్డు కోరమండల్ నుంచి హెచ్‌పిసిఎల్‌లోకి వెళ్లే గెడ్డను పరిశీలించారు. ఈ గెడ్డ ముంపు వల్ల శ్రీహరిపురం, గుల్లలపాలెంలో విష జ్వరాలు సోకుతున్నాయని అధికారులకు ఎమ్మెల్యే గణబాబు వివరించారు.

నేర ప్రక్రియ చట్టాల పేరు మార్పు సహేతుకం కాదు

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్



కోర్టు ముందు నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ప్రజాశక్తి-లీగల్ : ఇటీవల కేంద్ర ప్రభుత్వం నేర ప్రక్రియ చట్టాల పేరును ఇంగ్లీష్ నుండి హిందీలోకి మార్చి తీసుకురావటం సహేతుకంగా లేదని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బివి.రామాంజనేయరావు పేర్కొన్నారు. ఈ చట్టాల అమలు నిరసిస్తూ జిల్లా ప్రధాన న్యాయస్థానం ప్రధాన ద్వారం వద్ద ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ విశాఖపట్నం యూనిట్ సభ్యులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బెవర సత్యనారాయణ, పలువురు న్యాయవాదులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ చట్టాలలో ఉన్న కొన్ని నిబంధనలు భావ ప్రకటన స్వేచ్ఛకు వ్యతిరేకంగానూ, న్యాయవాది వృత్తిలో ఒత్తిడికి లోనయ్యే విధంగానూ ఉన్నాయన్నారు. ఇండియన్ పీనల్ కోడ్ జులై 1 నుంచి భారతీయ న్యాయ సంహితగాను, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ భారతీయ నాగరిక సురక్ష సంహిత గాను, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ భారతీయ సాక్ష్యం అదినియం గాను పేర్లు మార్పు చెందుతాయని తెలిపారు. తక్షణమే వీటి అమలును నిలుపుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి నూకల వెంకటేశం మాట్లాడుతూ, పోలీసు, న్యాయవ్యవస్థలో సాంకేతికంగా ప్రస్తుత కాలానికి అనుగుణంగా అభివృద్ధి చేయకుండా ఈ చట్టాలను జులై 1 నుండి అమలు చేయటం మంచి పద్ధతి కాదన్నారు.

1, 2, 3 తేదీలలో సిపిఐ రాష్ట్ర సమావేశాలు

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాలు జులై 1వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఎజె.స్టాలిన్ తెలిపారు. గురువారం గాజువాకలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖ నగరంలో నిర్వహిస్తున్న సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాలను విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వాల ప్రతికూల పోకడలను కొత్త ప్రభుత్వం విడనాడాలని సూచించారు. మతోన్మాద బిజెపితో అంటకాగడాన్ని ఆక్షేపించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను ఈ ప్రభుత్వం చేయకుండా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని హితవు పలికారు. ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వే జోన్ ఏర్పాటు, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు రాజకీయాలకతీతంగా కార్యాచరణ రూపొందించాలని కొత్త ప్రభుత్వానికి సూచించారు. గాజువాక నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, గత వైసిపి ప్రభుత్వంలా ప్రస్తుత ఎన్డీయే కూటమి అసంబద్ధ విధానాల మీద వెళితే ఆ పార్టీకి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నియోజకవర్గ సమితి సభ్యులు ఎల్లేటి శ్రీనివాసరావు, జి.ఆనంద్, పి.దుర్గారావు, కె.పోతయ్య, కె..రాజబాబు, కె.అచ్యుతరావు, అప్పారి విష్ణుమూర్తి, మహిళా నేత కె.వనజాక్షి పాల్గొన్నారు.

కరపత్రం విడుదల

తగరపువలస : విశాఖ నగరంలోని మురళీనగర్‌లో జులై 1 నుంచి 3వ తేదీ వరకు జరుగు సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక జిఆర్ భవన్‌లో ఆ పార్టీ నాయకులు గురువారం కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, ఎఐటియుసి నాయకులు అల్లు బాబూరావు, కొండపు ఈశ్వరరావు, కానూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల ఉల్లంఘన జరగకుండా పోరాటం

ప్రజాశక్తి -కరాస: మానవ హక్కుల ఉల్లంఘన జరగకుండా తమ వంతు బాధ్యతగా పోరాటం చేస్తానని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా జాతీయ కన్వీనర్ బిఎస్ కృష్ణ (ఆల్ఫా కృష్ణ) హామీ ఇచ్చారు. జాతీయ కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గురువారం ఎన్ఎడి కొత్త రోడ్డులోని హోటల్ ఆల్ఫాలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఎస్.కృష్ణ మాట్లాడుతూ, బాధితులకు అండగా నిలబడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్‌సి స్టేట్ ప్రెసిడెంట్ జెర్రిపోతుల నానాజీ, లీగల్ అడ్వైజర్ మోదుల్ రాజేశ్వరరావు, మంజుల, సెల్వాని, మాదాసు చారేంద్ర, జయకృష్ణ, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మాక్ డ్రిల్

- ప్రజలు ఆందోళన చెందొద్దు

ప్రజాశక్తి -ములగాడ : కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యాన శుక్రవారం ఉదయం 11 నుంచి 12:30 గంటల మధ్య కంపెనీ ప్రమాదాలు, విపత్తులు జరిగినప్పుడు అత్యవసర పరిస్థితులను ఎలాగా ఎదుర్కోవాలి అన్న విషయంపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నామని సంస్థ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పబ్లిక్ అవగాహన కోసం డిస్టిక్ అడ్మినిస్ట్రేషన్ పర్యవేక్షణలో పిలకవానిపాలెం గ్రామంలో ఈ కార్యక్రమం చేపడుతున్నామని పేర్కొన్నారు. స్థానిక ప్రజలెవరూ ఆందోళన చెందొద్దని తెలిపారు.

అలరించిన సంగీత విభావరి

ప్రజాశక్తి-సీతమ్మధార : స్వర సంఘం, స్వరమాధుర్యం సంస్థల ఆధ్వర్యాన విశాఖ పౌర గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. సంస్థ అధ్యక్షుడు డిఎం.రావు, కార్యదర్శి పివి.రఘుపతి ఆధ్వర్యాన గాయనీ గాయకులు ఆనంద్‌రెడ్డి, సంపత్‌కుమార్, శ్రియ ససిరాని, శైలజ, మాధవి పాటలు పాడి ప్రేక్షకులు మన్ననలు పొందారు.



టిడిపి రాష్ట్ర అధ్యక్షులుగా నేడు పల్లా ప్రమాణ స్వీకారం

గాజువాక నుంచి భారీగా తరలివెళ్లిన పార్టీ శ్రేణులు

ప్రజాశక్తి -గాజువాక : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శుక్రవారం అమరావతిలోని పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గాజువాక నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, ఆయన స్నేహితులు, బంధువులు అధిక సంఖ్యలో విజయవాడ చేరుకున్నారు. మరి కొంతమంది రెండు రోజులు ముందుగానే విజయవాడ చేరుకున్నారు. పల్లా శ్రీనివాసరావుకు మంత్రి పదవి వస్తుందని గాజువాక పార్టీ శ్రేణులు ఎదురుచూశారు. అయితే పల్లాను రాష్ట్ర అధ్యక్షులుగా చంద్రబాబు నియమిచండంతో వారంతా వారం రోజులుగా ఉత్సాహంగా ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పల్లా శ్రీనివాసరావు పేరు తెలియాలని గాజువాక హైవే కూడలి వద్ద పెద్దపెద్ద హోర్డింగ్‌లు పెట్టారు. విజయవాడ నలుమూలలా కూడా భారీ ఎత్తున హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. గాజువాకలో రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబంలో పల్లా శ్రీనివాసరావు 1968లో జన్మించారు. పల్లా శ్రీనివాసరావు తండ్రి పల్లా సింహాచలం విశాఖ-2 నియోజకవర్గంలో ఎన్‌టి.రామారావు హయాంలో ఎమ్మెల్యేగా గెలుపొందారు. పల్లా శ్రీనివాసరావు ఆంధ్రా యూనీవర్సిటీలో ఎంటెక్, ఎంబిఎలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఎంటెక్‌లో సివిల్ విభాగం కావడంతో విశాఖ నగరంలో చాలా ప్రాజెక్టులకు ఉచితంగానే కన్సల్టేషన్ ఇచ్చేవారు. 2009లో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ తరపున విశాఖ ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్‌లో విలీనం కావడంతో శ్రీనివాసరావు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014లో గాజువాక కాంగ్రెస్ అభ్యర్థిగా పార్టీ బిఫారం ఇచ్చినప్పటికీ, టిడిపి టికెట్ కోసం ప్రయత్నించి, సాధించి, గెలుపొందారు. 2019లో గాజువాకలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీలో ఉండడంతో టిడిపి అభ్యర్థిగా పోటీచేసి, వైసిపి చేతిలో ఓటమి పాలయ్యారు. తర్వాత విశాఖ జిల్లా టిడిపి అధ్యక్షునిగా చంద్రబాబు నియమించారు. రాష్ట్రంలో టిడిపి ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జిల్లాలో ఎలాంటి గ్రూపులకు ఆస్కారం లేకుండా అందరినీ సమన్వయం చేస్తూ పార్టీని సమర్థవంతంగా నడిపించారు. 2024 ఎన్నికల్లో గాజువాక నుంచి పోటీ చేసి రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో టిడిపి ఎమ్మెల్యేగా పల్లా గెలుపొందారు. అందరూ మంత్రి పదవి వస్తుందని ఆశించినప్పటికీ, రాజకీయ, కుల, ప్రాంతీయ సమీకరణలతో అది నెరవేరలేదు. పల్లాపై అధినేత చంద్రబాబుకు ఉన్న నమ్మకం, భరోసాతో పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను అప్పగించారు. పల్లాకు తెలుగుదేశం రాష్ట్ర పగ్గాలు దక్కడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నప్పటికీ, మంత్రి పదవి వస్తే బాగుండేదని కొందరు కార్యకర్తలు, నాయకులు అభిప్రాయ పడుతున్నారు.



కల్కి విడుదలతో సంబరాలు



రామచంద్ర థియేటర్ వద్ద సందడి చేస్తున్న ప్రభాస్ అభిమానులు

ప్రజాశక్తి-.అనకాపల్లి : ప్రభాస్ నటించిన కల్కి మూవీ విడుదల సందర్భంగా గురువారం పట్టణంలోని శ్రీ రామచంద్ర థియేటర్‌లో ప్రభాస్ అభిమానుల కేరింతలతో సంబరాలు చేసుకున్నారు. అనకాపల్లి పట్టణ ప్రభాస్ ఫ్యాన్స్ గౌరవాధ్యక్షులు ఆళ్ళ ప్రవీణ్‌కుమార్, అధ్యక్షులు జివిఎల్ఎన్, రాజు,ఆధ్వర్యంలో శ్రీ రామచంద్ర థియేటర్ దగ్గర భారీ కేక కట్‌చేశారు. భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంతోపాటు బాణసంచా పేలుళ్లతో సంబరాలు జరుపుకున్నారు. చిత్రానికి పాజిటివ్ టాక్ రావడంతో రికార్డు స్థాయి వసూళ్లను సాధించి, ప్రపంచ చలనచిత్ర పరిశ్రమలో టాలీవుడ్ స్థాయిని ఇనుమడింపజేస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆళ్ల ప్రసాద్, బావిశెట్టి కిషోర్,కర్రి ప్రసాద్,కాకరపర్తి నాని,కార్తీక్, చింతల ధర్మేష్, కొణతాల మనోజ్, బిల్లా సురేష్, కరణం ప్రభు కిషోర్ ప్రభాస్ అభిమానులు పెద్దఎత్తున పాల్గొని సందడి చేశారు.

మాజీ ఎమ్మెల్యే పీలాకు ఘనసత్కారం



పీలా గోవిందను సత్కరిస్తున్న నోబెల్ ట్రస్ట్ నూకరాజు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ఎమ్మెల్యేగా కొణతాల రామకృష్ణ, ఎంపీగా సిఎం రమేష్ కూటమి అభ్యర్థుల విజయంలో కీలకపాత్ర పోషించిన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్రలను సత్కరించారు గవరపాలెం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నోబుల్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఎఎంఎఎల్ కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపల్ శరగడం నూకరాజు మాస్టర్ ఆధ్వర్యంలో వీరిని అభినందించి, పుష్పగుచ్చాలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పీలా గోవింద్ మాట్లాడుతూ ఈ విజయం కూటమి నాయకులందరికీ దక్కుతుందని, నాయకులు, కార్యకర్తలతోపాటు, ప్రజలు కూడా పూర్తిగా సహకరించి కూటమి అభ్యర్థులు గెలిపించా రన్నారు. భవిష్యత్‌లో అనకాపల్లి నియోజకవర్గాన్ని అందరి సమిష్టి సహకారంతో అభివృద్ధిపథంలో తీసుకెళతామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గొంటిన శ్రీనివాసరావు, జెర్రిపోతుల నూక నాయుడు, రామారావు పాల్గొన్నారు.

ముమ్మరంగా సరుగుడు నాట్లు



సరుగుడు మొక్కలు నాటుతున్న రైతులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : కొద్దిరోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతన్నలు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. పలు గ్రామాల్లో రైతులు సరుగుడు నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. రెండు రోజులుగా చిరుజల్లులు కురుస్తూ ఉండడంతో మండలంలో బంగారు మెట్ట చిన్నపనపాలెం దిబిడి బుచ్చయ్యపేట, కందిపూడి, తదితర గ్రామాల్లో రైతులు సరుగుడు నాట్లు వేస్తున్నారు.

రేపు జాతీయ లోక్‌అదాలత్

కక్షిదారులు సద్వినియోగం చేసుకోండి

జిల్లా ఎస్‌పి మురళీకృష్ణ



ప్రజాశక్తి-అనకాపల్లి : ఈనెల 29న శనివారం నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్‌పి కె.వి.మురళీకృష్ణ పిలుపు నిచ్చారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ చేయదగిన క్రిమినల్, సివిల్ వివాదాలు, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసులలో కోర్టు ఇచ్చిన నివేదిక, జిల్లా పరిధిలోని పోలీసు స్టేషన్లలో నమోదైన కేసుల ప్రకారం రాజీ పడటానికి అవకాశం ఉన్న కేసులలో కక్షిదారులకు నోటీసులు జారీ చేశారన్నారు. ఇరుపక్షాల వారికి కౌన్సిలింగ్ నిర్వహించి, జాతీయ లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించి వారి సమ్మతితో రాజీ మార్గంలో కేసుల పరిష్కారానికి ప్రయత్నించా లన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని పోలీస్ అధికారులను ఎస్‌పి ఆదేశించారు. నోటీసులు అందిన కక్షిదారులు వారి కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గంలో పరిష్కరించుకు నేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. . ప్రస్తుతం జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అనేక కేసులలో రాజీపడే అవకాశం ఉందన్నారు. కేసులు రాజీ ద్వారా పరిష్కరించుకుంటే వేళ్ల తరబడి తిరిగే శ్రమ, సమయం తగ్గుతుందని, డబ్బు ఆదా అవుతుందని, సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. ఇరు పక్షాల మధ్య స్నేహపూరిత సంబంధాలు ఉంటాయన్నారు. ఇప్పటికే జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి జాతీయ లోక్ అదాలత్ గురించి కక్షిదారులకు వివిధ మాధ్యమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని చింతనిప్పుల అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణతో కలిసి గురువారం సందర్శించారు. పాఠశాలలోని సమస్యలను ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం జనసేన ఐటీ టీమ్ సభ్యులు సమకూర్చిన మైక్ సెట్‌ను పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీసెట్టి బాబ్జీ, పార్టీ నాయకులు బంటు రవి, దాడి పెంటారావు, సరగడం ఆదిబాబు, భరత్ బాబు, చదరం నాగేశ్వరరావు, ముమ్మిన పైడిరాజు, మద్దాల వెంకటేష్, తలారి కాశీనాయుడు, పీలా మహలక్ష్మి నాయుడు, రాకోటి అప్పారావు, కోరుకొండ రమణ, గంట్ల సూరిబాబు పాల్గొన్నారు.



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న రామకృష్ణ

ఉన్నత పాఠశాలలో డిఇఒ తనిఖీలు



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డిఇఒ వెంకట లక్ష్మమ్మ

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని పామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు తగు సూచనలు చేశారు. ప్రతి రోజూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరుకావాలని కోరారు. ఉదయాన్నే యోగా చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. నిర్మాణం పూర్తయిన అదనపు తరగతి గదులను ప్రారంభించడానికి సన్నాహాలు చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ప్రయోగశాలను పరిశీలించారు. అనంతరం 4వ తరగతి విద్యార్థులు ఆంగ్లంలో ప్రదర్శించిన రోల్‌ప్లేను తిలకించి, విద్యార్థులను అభినందించారు. మానిటరింగ్ అధికారి వై. వెంకటేశ్వరరావు, ఎఎంఒ పట్నాయక్, ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, ఉపాధ్యాయులు బాబు, గొంది చినబ్బాయ్, వసంతరావు, ఉమా, విజయలక్ష్మి, స్వామి, కరుణ జ్యోతి, గౌరి, పట్టాభి, కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఆదిరెడ్డిపాలెం పాల సొసైటీ అధ్యక్షునిగా రమణ

ప్రజాశక్తి-సబ్బవరం: మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు ఆదిరెడ్డిపాలెం విశాఖ డెయిరీ పాల సొసైటీ అధ్యక్షునిగా ఆదిరెడ్డి రమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రమణను గ్రామ పెద్దలు, పాడి రైతులు అభినందించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ పాడిరైతుల సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు చిటికెరెడ్డి అప్పారావు, కోటాన అచ్చిబాబు, గండి వెంకటస్వామి, ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి కృష్ణ, కామిరెడ్డి లక్ష్మి, ఆదిరెడ్డి పోతుబాబు, ఎంపిటిసి బైలపూడి దేముడు బాబు, కొటాన అప్పారావు, కొటాన కోటయ్య పాల్గొన్నారు.



రమణను అభినందిస్తున్న పాడిరైతులు, గ్రామస్తులు

కల్కి టిక్కెట్ ధరలు తగ్గించాలి



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నేత శివాజీ

ప్రజాశక్తి-అనకాపల్లి : రెబల్ స్టార్ ప్రభాస్ నూతన సినిమా కల్కి టికెట్ ధరలు తగ్గించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ డిమాండ్ చేశారు. గురువారం దొడ్డి రామునాయుడు భవన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ, కల్కి సినిమా టిక్కెట్ ధరలను అమాంతంగా పెంచేయడంతో సామాన్య సినీ ప్రేక్షకులు, అభిమానులు థియేటర్లలో సినిమా చూడలేని పరిస్థితి ఉందన్నారు. .రూ. 100 టిక్కెట్లు ను రూ.200లకు, రూ.150 టికెట్లును రూ.250 చేయడంతోపాటు 3డి విజువల్ ఎఫెక్ట్ కోసం అదనంగా మరో రూ.30 వసూళ్లు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభాస్ మీద ప్రజలకున్న అభిమానాన్ని ఆసరా చేసుకుని ఇలా రెట్టింపుమించి టిక్కెట్ ధరలను పెంచడం సరికాదని, వెంటనే టిక్కెట్ ధరలను తగ్గించాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అల్లు రాజు, నాయకులు పి.చలపతి పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి- మునగపాక: స్థానిక సంతబయలులో కొలువైన అభయాంజనేయస్వామి ఆలయ 26వ వార్షికోత్సవాన్ని ఈనెల 28న నిర్వహించనున్నామని ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల మాణికంఠ తెలిపారు. 28న శుక్రవారం ఉదయం స్వామికి పంచామృత, నారికేళ అభిషేకాలు, సింధూరం తమలపాకులతో సహస్రనామార్చన పూజలు నిర్వహిస్తామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

ఆర్‌టిసి టోల్‌ఛార్జీలు రద్దు చేయాలి



జిల్లా రవాణా అధికారికి వినతి పత్రం ఇస్తున్న సిపిఐ నేతలు

ప్రజాశక్తి -అనకాపల్లి : జివిఎంసి పరిధిలో అనధికారికంగా నిర్వహిస్తున్న టోల్‌గేట్‌ను ఇప్పటికైనా ఎత్తేయడం హర్షనీయమని సిపిఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం, పార్టీ నాయకులు కోరుబిల్లి శంకరరావు, ముక్కామల చిన్ని, మత్తుర్తి సూరిబాబు అన్నారు. అయితే టోల్‌గేట్ తొలగించి మూడు రోజులు గడిచినప్పటికీ, ఆర్‌టిసి బస్సులలో టిక్కెట్ ఛార్జీలలో టోల్ ఫీజును తగ్గించకపోవడం దుర్మార్గమన్నారు. గురువారం అనకాపల్లి జిల్లా ప్రజా రవాణా అధికారి పద్మావతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ టోల్‌గేట్ మీదుగా ఇతర రాష్ట్ర బస్సులే కాకుండా రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన వేలాది బస్సులు, ఇతర వాహనాలు తిరుగుతున్నాయన్నారు. టోల్ గేటు తొలగించినప్పటికీ ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణిస్తున్న వారి నుంచి టోల్ ఛార్జీలు వసూలు చేస్తున్నారని, ఇప్పటికైనా వీటి వసూళ్లను నిలుపుదల చేయాలని కోరారు. లేకుంటే ప్రయాణికుల తరపున ఆర్‌టిసి డిపోల వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. దీనిపై ఆర్‌టిసి రవాణాశాఖ అధికారులు స్పందిస్తూ, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారి సూచనల మేరకు తగు చర్యలు తీసుకుంటామన్నారు.

రాయితీపై వరి విత్తనాల పంపిణీ



వరి విత్తనాలను పంపిణీ చేస్తున్న డిసిసిబి మాజీ డైరెక్టర్ రవి

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : ప్రభుత్వం రాయితీపై అందించిన వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిసిసిబి మాజీ డైరెక్టర్, కోరుకొండ రవికుమార్ తెలిపారు. గురువారం మండలంలోని తురకలపూడిలో రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బుదిరెడ్ల శ్రీనివాసరావు కోరుకొండ సత్యారావు, గంటల నరేష్, మంత్రి కొండనాయుడు, వెనకోటి వెంకటేష్, గంటల రాము వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట : మండలంలో అచ్చర్ల గ్రామ సచివాలయం వద్ద గురువారం రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు నైనముశెట్టి రమణారావు, దొడ్డి నాగేశ్వరరావు, నిమ్మదల సూరిఅప్పలరాజు, నిమ్మదల బుల్లిబాబు, భీమవరపు శ్రీను, భూషణం సచివాలయకార్యదర్శి మదిని మహేష్ , సిబ్బంది రైతులు పాల్గొన్నారు అనంతరం గ్రామంలో తాగునీటి మోటారు, వాటర్ టాంకును ఆరోగ్య సిబ్బందితో పరిశీలించారు


పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : పండ్ల తోటల పెంపకానికి మండలంలోని ఐదెకరాల లోపున్న చిన్న సన్నకారు రైతులకు ప్రభుత్వపరంగా సాయం అందజేయనున్నట్లు ఎపిఒ మురళీ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు తమ పుర్లను స్థానిక ఫీల్డ్ అసిసెంట్‌ను లేదా ఉపాధికార్యాలయంలో సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. మండలంలో ఇప్పటివరకు 130మంది రైతులను గుర్తించామన్నారు.

పండ్ల తోటల పెంపకంలో భాగంగా ఉపాధి హామీ పథకం కింద రైతులకు మొక్కల కొనుగోలు, మొక్కలు నాటేందుకు గోతుల తవ్వకం, వాటి సంరక్షణకు సాయం ఇలా ప్రభుత్వపరంగా నగదు సాయం అందజేస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గ్రామీణ వైద్యుల చట్టబద్ధతకు కృషి చేస్తా

- ఎమ్మెల్యే కెఎస్ఎన్.రాజు



ఎమ్మెల్యే రాజును సత్కరిస్తున్న గ్రామీణ వైద్యులు

ప్రజాశక్తి -వడ్డాది : గ్రామీణ వైద్యులకు అండగా ఉండి, వారి సమస్యల పరిష్కారానికి, వారి వృత్తి చట్టబద్ధతకు తనవంతు కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎస్.రాజు, టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బత్తుల.తాతయ్య బాబు భరోసానిచ్చారు. గురువారం అనుభవ వైద్య సంఘాల సమాఖ్య కార్యదర్శి, బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పదిలం బెన్నబాబు ఆధ్వర్యంలో ఆర్ఎంపి వైద్యులు వారిని కలిసి అభినందించారు. ఇటీవల కూటమి పార్టీ విజయంసాధించి, రాష్ట్రంలో అధికారం చేపట్టడంపై హర్షం వెలిబుచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.యస్.యన్.రాజు మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల సమస్యలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ దృష్టికి తీసుకుని వెళ్లి గ్రామీణ వైద్యుల చట్టబద్ధతకు కృ షి చేస్తానని హామీనిచ్చారు కార్యక్రమంలో ఆర్ఎంపి డాక్టర్లు రౌతు.ప్రసాద్ వామనమూర్తి, రాయి.శ్రీనివాస్, రాందాస్ కృష్ణ చిన్నబ్బాయి, భావిశెట్టి.దొర, స్థానిక ఆర్ఎంపి వైద్యులు బెన్నాబత్తు .శ్రీరామమూర్తి (పెంటబాబు), దండి నూకరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రహదారి గోతులను పూడ్చరా..?



గోతులమయంగా ఉన్న కన్నూరుపాలెం రోడ్డు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలో కన్నూరుపాలెం గ్రామం వద్ద నర్సీపట్నం రోడ్డులో గోతులను పూడ్చాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు. ప్రధానంగా అనకాపల్లి, నర్సీపట్నం రహదారిలో ఉన్న గోతులతో నిత్యం అధిక సంఖ్యలో రాకపోకలు సాగించే వాహనదారుతు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని, ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రోడ్డు పొడుగునా ఉన్న గోతులతో వాహనాలు మరమ్మతులకు గురౌతున్నాని వాపోతున్నారు. నెలల తరబడి గోతులతో నిండి, ప్రజలు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరించడం స్థానికులు ఆందోళన చెందుతూ, ఇప్పటికైనా స్పందించి, రోడ్డు పునర్నిర్మాణం చేయాలని లేకుంటే కనీసం మరమ్మతులైనా చేపట్టాలని కోరుతున్నారు

చోడవరానికి బస్ సౌకర్యం మెరుగుపరచండి

ప్రజాశక్తి- దేవరాపల్లి : చోడవరానికి బస్సు సౌకర్యాలు మెరుగు పర్చాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి వెంకన్న డిమాండ్ చేసారు, గురువారం విడుదల చేసిన ప్రకటనలో చోడవరంలో విద్య, వైద్యం, ఇతర అవసరాల కోసం దేవరాపల్లి, చీడికాడ, వి. మాడుగుల, బుచ్చయ్యపేట, కె కోటపాడు మండలాల నుంచి చోడవరానికి వెళ్ళాలంటే పూర్తిస్థాయిలో బస్ సౌకర్యాలు లేన పరిస్థితుల్లో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నియోజకవర్గాలకు కేంద్రబిందువుగా ఉన్న చోడవరంలోనే రిజిస్ట్రార్ ఆఫీస్, కోర్టు కూడా ఉన్నాయని ఈ నేపథ్యంలో రవాణా సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

మాడుగుల, చీడికాడ, బుచ్చయ్యపేట మండల కేంద్రాలకు సైతం రాత్రిపూట బస్సు సౌకర్యం అరకొరగా ఉన్నాయన్నారు. మాడుగుల, చోడవరం నియోజకవర్గాలకు పూర్తిస్థాయి కనెక్టవిటీ లేకపోవడం వల్లే అన్నిరంగాల్లో వెనకబాటు కనిపిస్తోందన్నారు.రవాణా సౌకర్యం లేని ఏ గ్రామమైనా, ప్రాంతమైనా అభివృద్ధిలో వెనుకబాటు ఉంటుందనేది వాస్తవ పరిస్థితుల్లో సుస్పష్టమైన నేపథ్యంలో, కొత్త ప్రభుత్వమైనా రోడ్డు, రవాణా సౌకర్యాలపై దృష్టిపెట్టి మెరుగుపరుస్తుందని ఆయా ప్రాంతాల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు దేవరాపల్లిలో హాస్టల్ సౌకర్యంతో ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయాలని, కస్తూర్బా పాఠశాలల్లో సీట్లు పెంచాలని, వసతిగృహాలకు పక్కా భవనాలను మంజూరుచేయాలని, గిరిజనులకు ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరారు.

వెండి వడ్డాణం వితరణ



గంగాలమ్మకు వెండి వడ్డాణం ఇస్తున్న దాత సత్యవతి

ప్రజాశక్తి- మునగపాక: మండలంలోని మూలపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న గంగాలమ్మ తల్లి ఆలయానికి మూలపేట గ్రామానికి చెందిన కోయిలాడ సత్యవతి తన భర్త అప్పారావు జ్ఞాపకార్థం కుటుంబసభ్యులతో కలిసి గురువారం కిలోన్నర బరువైన వెండి వడ్డాణాన్ని బహూకరించింది. గుడి నిర్మాణంలో భాగస్వాములైన సత్యవతి కుటుంబీకులను ఆలయ నిర్వాహకులు అభినందించారు. అమ్మవారి గుడి నిర్మాణానికి మరింత మంది దాతలు ముందుకు వచ్చి ధన, వస్తు రూపేణా సహాయ, సహకారాలు అందజేయాలని సర్పంచ్ గంగప్పల నాయుడు కోరారు.

వైభవంగా మరిడిమాంబ పండగ

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో మరిడిమాంబ పసుపు కుంకుమ పండుగ గురువారం ఘనంగా నిర్వహించారు మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఉదయం నుంచే మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారికి పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు సాయంత్రం గ్రామంలో అమ్మవారి ఘటాలు ఊరేగించారు కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుల్లేపల్లి మురళి కొల్లి ఈశ్వరరావు దీవి శంకర్ బండారు అప్పలనాయుడు మిడతాడ శ్రీను, సబ్బవరం మాలి బాబు మోర అప్పలకొండ పాల్గొన్నారు

ఘనంగా గ్రామదేవత పండగ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని ఆర్ వై అగ్రహారం గ్రామదేవత మరిడిమాంబ పండగ గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 30 ఏళ్ల తర్వాత గ్రామస్తులంతా విరాళాలు సేకరించి, ఈ పండగను నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులందరూ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి, మొక్కులను తీర్చుకున్నారు. గ్రామంలోని ఆచారాన్ని అనుసరించి ప్రత్యేకంగా తయారుచేసిన చక్కరథంపై నాలుగు కుటుంబాలకు చెందిన నలుగురు వ్యక్తులు కూర్చొని అమ్మ వారి గుడి వరకు బాణసంచా పేలుళ్లతో ఊరేగించారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యుత్ శాఖ మంత్రిని కలిసిన గండి బాబ్జి

ప్రజాశక్తి- సబ్బవరం: రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను విశాఖపట్నం జిల్లా టిడిపి అధ్యక్షులు, పెందుర్తి నియోజక వర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

ఉప్పొంగిన గెడ్డలో చిక్కుకున్న వైద్యసిబ్బంది

సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన గిరిజనులు



వైద్యసిబ్బందిని సరియావాగు నీటిలో దిగి దాటిస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి- దేవరాపల్లి: మారుమూల గిరిజన గ్రామాల్లో వైద్యసేవలు అందించడానికి వెళ్లిన వైద్య సిబ్బంది ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డల ధాటికి గంటల కొలది ఆవలి ఒడ్డున ఉండిపోయిన ఘటన చోటు చేసుకుంది. స్థానిక గిరిజనుల సహకారాలతో ప్రాణాలతో ఒడ్డుకు చేరుకోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అనంతగిరి మండలం పినకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జీనబాడు ఉపకేంద్రానికి చెందిన ఎఎన్ఎం కె.పుష్ప, హెల్త్ అసిస్టెంట్ బి.రామరాజు, మానస మిత్ర డి.జమ్మలమ్మ బుధవారం బెంబి గ్రామానికి వైద్య సేవలు అందించడానికి వెళ్లారు. దేవరాపల్లి మండలం వాలాబు పంచాయతీ కెటిపాలెం వరకు ద్విచక్ర వాహనంపై వెళ్లిన వారు, అక్కడ నుంచి రహదారి సౌకర్యం లేకపోవడంతో ఐదు కిలోమీటర్లు కాలినడకన బెంబి గ్రామానికి చేరుకొని వైద్య శిబిరం నిర్వహించి గిరిజనులకు వైద్యసేవలు అందించారు. తిరిగి వస్తుండగా సరియావాగు వద్దకు చేరేసరికి, వర్షాలు కురవడంతో ఉధృతంగా ప్రవహించిన వాగును దాటలేక అవతలి వైపున గంటల తరబడి ఉండిపోయారు. వైద్యసిబ్బంది కేకలు వేయడంతో కె.టిపాలెం గిరిజనులు అక్కడికి చేరుకుని, వైద్యసిబ్బంది ఒక్కొక్కరినీ చేతులను పట్టుకుని, నిండుగా ప్రవహిస్తున్న సరియావాగును అతికష్టం మీద దాటించి, ఇవతలి ఒడ్డుకు చేర్చారు. దీంతో వైద్యసిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. తమకు సాయం చేసిన గిరిజనులకు వైద్యసిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.



బెంబి గ్రామంలో వైద్యశిబిరంలో జీనబాడు వైద్యసిబ్బంది

సెల్ సిగ్నల్స్‌ను మెరుగుపరచాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం చీమలపాడు శివారు జెడ్ జోగంపేట గ్రామంలో ఆరు నెలల క్రితం బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌ని ఏర్పాటు చేసినా నేటికీ సిగ్నల్ అందలేదని సిపిఎం ఆధ్వర్యంలో పలు గ్రామాల గిరిజనులు రాయిపాడులో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు పొంగి చంద్రయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవిందరావు మాట్లాడుతూ, జెడ్.జోగంపేటకు సమీపంలో రొచ్చుపనుకు, గంగంపేట, తాటిపర్తి, పెద్దగరువు, రాయిపాడు, నేరేడుబంధ, కడగడ్డ, ఆజయపురం, బంగారుబందలు గ్రామాల్లో పెన్షన్ కోసం, ఇతర సంక్షేమ పథకాలు అమలుకు సెల్ సిగ్నల్ లేక పోవడంతో నానా అవస్థలు పడుతున్నారని వాపోయారు. రేషన్ బియ్యం కోసం వెళ్లాలంటే 13 కిలోమీటర్ల దూరంలో కళ్యాణపు లోవలో జిసిసి రేషన్ డిపోకి వెళ్ళవలసి వస్తోందన్నారు. సిగ్నల్స్ సక్రమంగా ఉండకపోతే నెలలో నాలుగైదు సార్లు తిరగవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జోగంపేటలో సిగ్నల్ పాయింట్‌ను వినియోగంలోకి తీసుకు రావాలని డిమాండ్ చేశారు. జోగంపేటలో జిసిసి సబ్ డిపో ఏర్పాటు చేయాలని గోవిందరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజనులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న గోవిందరావు, గిరిజనులు



మాట్లాడుతున్న వైద్యాధికారిని మౌనిక

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని పిహెచ్‌సి వైద్యాధికారిని మౌనిక సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఉపాధ్యాయులకు వివరించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులతో ఎంఈఓ రామారావు ఆధ్వర్యాన గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పరిశుభ్రమైన నీళ్లను, ఆహారాన్ని అందించాలని సూచించారు. డయేరియాపై తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం ఎంఈఓ రామారావు మాట్లాడుతూ, విద్యార్థులకు పుస్తకాలు బ్యాగులు, బూట్లు ప్రతి ఒక్కరికి అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 జోష్ పాల్గొన్నారు.

నక్కపల్లి ఎస్ఐగా సన్నిబాబు



ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి ఎస్ఐగా సన్నిబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎస్పీ కార్యాలయం నుండి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు బాధ్యతలు చేపట్టిన సన్నిబాబు మాట్లాడుతూ, శాంతి భద్రతకు విఘాతం కలగకుండా విధులు నిర్వహిస్తానని అన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి -నక్కపల్లి:రైతుల సంక్షేమ టిడిపి లక్ష్య మని టిడిపి తెలుగు రైతు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొప్పిశెట్టి కొండబాబు అన్నారు. మండలంలోని ఉపమాక రైతు భరోసా కేంద్రం వద్ద గురువారం ప్రభుత్వం సబ్సిడీ పై అందిస్తున్న వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ, వ్యవసాయ శాఖ సూచనలు మేరకు రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి నిచ్చే కొత్త రకాలైన వరి విత్తనాలను వినియోగించుకోవాలన్నారు. సబ్సిడీపై ఎరువులు కూడా సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రగడ వీరబాబు, టిడిపి తెలుగు యువత నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, వ్యవసాయ సహాయకులు కంబాల రాజు, నాయకులు కొప్పిశెట్టి జగదీశ్వరరావు, వెంకటేశ్వరరావు, దొరబాబు, వరహాలరావు, తోలేటి శ్రీనివాస్, వాసు, సత్తిబాబు, గొర్ల రవి, తోట అప్పారావు, పాము గణేష్ పాల్గొన్నారు .



విత్తనాలు ఇస్తున్న నాయకులు



నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

విద్యార్థికి ఘన నివాళి

ప్రజాశక్తి-మాడుగుల: మాడుగుల డిగ్రీ కాలేజీ విద్యార్థి మృతి పట్ల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సివిఎస్ ఎస్ శాస్త్రి, అధ్యాపకులు సంతాపం తెలిపారు. మాడుగుల మండలం గాదిరాయి గ్రామానికి చెందిన ప్రభుత్వ డిగ్రీ విద్యార్థి వడ్డాది భవాని శంకర్ బుధవారం పిడుగుపాటుకు మృతి చెందాడు. కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపకులు, విద్యార్థులతో విద్యార్థి తల్లిదండ్రులను పరామర్శించారు.విద్యార్థి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని పెదతీనార్ల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఎంపిటిసి సభ్యులు మెరుగు నాగేశ్వరరావు, టిడిపి నాయకులు తాతారావు చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న ఎంపిటిసి సభ్యులు నాగేశ్వరరావు



ఎఎస్ఐ దంపతులను సత్కరిస్తున్న సిఐ, సిబ్బంది

ఎఎస్ఐకి ఘన సత్కారం

ప్రజాశక్తి-నాతవరం:స్థానిక పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ఏఎస్ఐ దొంతల బంగారురాజు ఉద్యోగ విరమణ సభను నాతవరం ఎస్ఐ రామారావు, సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నర్సీపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.హరి ఏఎస్ఐ దంపతులను పూలమాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 35 సంవత్సరాలు ఎటువంటి మచ్చ లేకుండా పనిచేసి, పదవీ విరమణ చేస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ఎస్సై కృష్ణారావు, పోలీస్ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



గుంతలు పడిన లింగంపేట రోడ్డు



రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

నక్కపల్లిలో భారీ వర్షం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని గురువారం విస్తారంగా వర్షం కురిసింది .ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వర్షపు నీరు ప్రవహించడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. పొలాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్‌కు సమాయత్తం అవుతున్న నేపథ్యంలో ఇప్పటికే రైతులు నారుమడులను సిద్ధం చేసుకున్నారు. ప్రభుత్వం వరి విత్తనాలను పంపిణీ చేయడంతో రైతు భరోసా కేంద్రాల వద్ద విత్తనాల కోసం రైతులు క్యూ కడుతున్నారు. వర్షాలు కురవడంతో వరి విత్తనాలు జల్లుకునేందుకు వాతావరణం అనుకూలంగా ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

చినుకు పడితే రహదారులు అస్తవ్యస్తం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో పలు రహదారులు వర్షాలు పడితే మరీ దారుణంగా మారుతున్నాయి. లింగంపేట ఆర్అండ్‌బి రహదారి గుంతల మయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రహదారిలో గుంతల మరమ్మతు చేపట్ట లేదు. దీంతో అవి మరింత పెద్దగా మారి కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితిలో ఈ రహదారి దర్శనమిస్తుంది. ఈ ప్రాంతంలోని గుంతల్లో నీరు చేరి కనిపించకపోవడంతో అనేక ప్రమాదాలు కూడా సంభవించిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా ఈ రోడ్డును బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. గొలుగొండ ఎస్సీ కాలనీ రోడ్డు ఇదే విధంగా దర్శనమిస్తుంది. ఈ రోడ్డులో ప్రయాణించాలంటే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ రహదారులకు కనీస మరమ్మత్తులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



గొలుగొండ ఎస్సీ కాలనీ సమీపంలో రోడ్డు



డైరీలను ఆవిష్కరిస్తున్న హెచ్ఎం, వాసవీక్లబ్ అధికారులు

స్టూడెంట్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రోలుగుంట:స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డిఎస్ఎస్‌వి.ప్రసాద్, వాసవీ క్లబ్ వి216ఎ అధికారులు పిఎస్.వరహాలరావు, వై.నర్సింగ్‌రావు, ఎస్.శ్రీను దాతల సహాయంతో ప్రత్యేకంగా తయారు చేయించిన స్టూడెంట్ డైరీని గురువారం డిప్యూటీ డిఈఓ పి.అప్పారావు ఆవిష్కరించారు. విద్యార్థుల డైరీతో విద్యా వికాసాన్ని తెలుసుకోవడానికి ఎంతో ఉపయోగమని, తల్లిదండ్రులకు కూడా ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరడానికి ఎంతో దోహదపడుతుందని తెలియజేశారు. ఈ డైరీని రూపొందించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, సహకరించిన దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.









మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

సచివాలయాన్ని తనిఖీ చేసిన అధికారులు

ప్రజాశక్తి-మాడుగుల: మాడుగుల మండలం పొంగలిపాక సచివాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గురువారం కింతలి పిహెచ్‌సి పరిధిలోని పొంగలిపాక సచివాలయంలో ప్రజా ఆరోగ్య సేవలు, సిబ్బంది పనితీరు, ప్రభుత్వ నిధులు వినియోగంపై జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. ఆడిట్ అధికారి ఏ. రామచంద్రరావు మాట్లాడుతూ, గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు రక్తహీనత సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు డిపిహెచ్ఎన్ఓ డి నాగమణి, డిపిఓ జగదీష్ నానాజీ, డేటా మేనేజర్ ఎమ్మెస్ జనార్ధన్, కింతలి ప్రాంతీయ వైద్య అధికారి డాక్టర్ మాలెం నాయుడు పాల్గొన్నారు.

మాడుగుల డిగ్రీ కళాశాల విద్యార్థులకు

పీజీ సెట్‌లో ఉత్తమ ర్యాంకులు

ప్రజాశక్తి - మాడుగుల: మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పీజీ సెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. గురువారం విడుదలైన పీజీ సెట్ పరీక్ష ఫలితాల్లో మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు తెలుగు లిటరేచర్‌లో 6వ ర్యాంక్, ఇంగ్లీష్ లిటరేచర్‌లో 13వ ర్యాంకు, 192వ ర్యాంకు, మ్యాథమెటిక్స్‌లో 406వ ర్యాంకు, 1902వ ర్యాంకులు సాధించి సత్తాని చాటారు. ప్రభుత్వ కళాశాలలో కూడా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడంపై కళాశాల అధ్యాపకులను గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.



మాట్లాడుతున్న తహాశీల్దార్

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: ప్రజా వినతులు తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. రెవెన్యూ పరమైన సమస్యలపై చర్చించారు. ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు తక్షణమే ఇవ్వాలని, గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వచ్చిన వినతులపై ప్రత్యేక దృష్టి సారించి, సమస్యలను పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ పరమైన సమస్యలు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో వీఆర్వోలు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం ప్రతినిధులు

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా మెట్టా ప్రభాకర్, కార్యదర్శిగా అనిమిరెడ్డి శివకృష్ణ, ఉపాధ్యక్షునిగా కోసూరి అప్పలనాయుడు, కోశాధికారిగా కె.వెంకటరమణ, సంయుక్త కార్యదర్శిగా ఎన్.వాసవి దత్త, లైబ్రేరియన్‌గా ఎంవిఆర్.పంతులు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా వి.గోవింద, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా డివి.రమణ, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా శ్రీకాకుళపు వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని పలువురు న్యాయవాదులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.





